మంచాల: రంగాపూర్‌లో ఎండిన వరిని కోస్తున్న మహిళా రైతు

వరి పంటే.. పశుగ్రాసం

నీళ్లు లేక ఎండిపోతున్న పంటలు

మంచాల, మార్చి 23: మంచాల మండలంలోని రంగాపూర్‌లో కౌలు రైతుకు సాగు నీటి కష్టాలు తప్పడం లేదు. కౌలుకు తీసుకున్న ఎకరం భూమిలో రూ. 25వేలు ఖర్చుపెట్టి పంటను సాగు చేస్తే అందులో వేసిన బోరులో నీటి మట్టం తగ్గిపోవడంతో పంటసాగు చేసుకున్న రెండు నెలల్లోనే పంట ఎండిపోయింది. ఎండిపోయిన పంటను పశుగ్రాసం కోసం కోసి బర్రెలు, ఆవులకు మేతగా వేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. పంటలు పండక అప్పులు ఎలా తీర్చాలో తెలియని ధీన స్థితిలో ఉన్నామని కౌలు రైతు పేర్కొన్నారు.

మద్యం ప్రియులకు అడ్డాగా..

దర్శనమిస్తున్న మద్యం సీసాలు పట్టించుకోని అధికారులు.. ఉపయోగంలోకి తేవాలని క్రీడాకారుల విజ్ఞప్తి

క్రీడా ప్రాంగణం

ముకునూరు క్రీడా ప్రాంగణంలో దర్శనమిస్తున్న ఖాళీ మద్యం సీసాలు

ఇబ్రహీంపట్నం, మార్చి 23 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగియున్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు లక్షలాది రూపాయలు వెచ్చించి గ్రామగ్రామానా క్రీడాప్రాంగణాలను ఏర్పాటు చేసింది. వీటిని గ్రామీణ యువత వినియోగించుకునేవారు. కానీ, నేడు కాంగ్రెస్ సర్కారు వాటిని గాలికొదిలేసింది. కిందిస్థాయి అధికారులు అటువైపు కూడా కన్నెత్తి చూడకపోవటంతో మద్యంప్రియులకు అడ్డాగా మారాయి. ఇబ్రహీంపట్నం మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో సాయంత్రం 6గంటలు దాటితే .. మందుబాబులు తిష్ఠ వేస్తున్నారు. అధికారులు పట్టించుకుని క్రీడాకారులకు ఉపయోగపడే విధంగా క్రీడా ప్రాంగణాలను తీర్చిదిద్దాలని గ్రామీణ ప్రాంతాల ప్రజలు, క్రీడాకారులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మాజీ ఎంపీటీసీ సరిత మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్, మార్చి 23: తలకొండపల్లి మండలం ఖానాపూర్ మాజీ ఎంపీటీసీ గార్లపాటి సరిత అనారోగ్యంతో బాధపడుతూ మరణించింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆదివారం ఉదదయం స్థానిక నాయకులతో కలిసి ఖానాపూర్ గ్రామంలో సరిత మృతదేహంపై పూలమాల వేసి వేర్వేరుగా నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ ఎంపీపీలు నిర్మల, శ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు గంప శ్రీను, పత్యానాయక్, దశరథ్‌నాయక్, రాజేశ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహా, వెంకట్ రెడ్డి, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

కాలనీ నూతన కమిటీ ఎన్నిక

ఇబ్రహీంపట్నం, మార్చి 23 : ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని సాయిరాంనగర్ కాలనీ కమిటీని ఆదివారం కాలనీవాసుల సమక్షంలో ఎన్నుకున్నారు. కాలనీ గౌరవ అధ్యక్షుడిగా నందికొండ రవీందర్‌రెడ్డి, గౌరవ సలహాదారులుగా బుచ్చిరెడ్డి, సురేశ్, అధ్యక్షుడిగా గోవర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు జ్ఞానేశ్వర్, సతీశ్, దేవేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కార్యదర్శి శ్రీరాములు, కోశాధికారిగా నరేశ్, సభ్యులుగా నరేందర్, భూపాల్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, శ్రీనివాస్, రవిందర్‌నాయక్, కృష్ణ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నందిగామ: సలివేంద్రిగూడలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

గ్రామాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ, మార్చి23: మండల పరిధిలోని రంగాపూర్ పంచాయతీ అనుబంధ గ్రామమైన సలివేంద్రిగూడలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ అభివృద్ధి పనులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాజ్‌గోపాల్, మాజీ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు నర్సింహ, రాజూనాయక్, రమేశ్‌గౌడ్, జ్ఞానేశ్వర్, రవీందర్‌గౌడ్, తుల సీరామ్, మహేందర్, హనుమాంత్, చంద్రశేఖర్, జంగయ్య, శేఖర్‌గౌడ్, లక్ష్మణ్, చందుయాదవ్ పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లిని నిర్మిస్తాం

కొందుర్గు : చౌదరిగూడ మండలంలో లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును నిర్మించి తీరుతామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండలంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నేతలు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

పట్టణ, గ్రామాల్లో భగత్‌సింగ్ వర్ధంతి నివాళులర్పించిన పలువురు నేతలు

యాచారం: ధర్మన్నగూడలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌టౌన్, మార్చి 23: భారత స్వాతంత్ర పోరాట యోధుడు భగత్‌సింగ్ నేటితరం యువతకు ఆదర్శమని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి ఎంఈవో మనోహర్, ఎస్ఐ రామచంద్రయ్య, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన వారిని అభినందించారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు చంద్రశేఖర్, సత్యం, రవి, శ్రీనివాస్, రాములు, కురుమయ్య, శ్రీనునాయక్, నర్సింహులు, ఈశ్వర్, శ్రీకాంత్, శివ, పద్మారెడ్డి, రవి పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం : భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్ గ్రామంలో 2కే రన్‌తో పాటు క్రికెట్ వన్డే లీగ్‌మ్యాచ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ..భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఆదర్శంగా తీసుకుని నేటి యువత ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా 2కేరన్, క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు సామెల్, ఎస్ఎఫ్ఐ నాయకులు శంకర్, కిషన్, వంశీ, డీవైఎఫ్ఐ నాయకులు గణేశ్, రమేశ్, ప్రణయ్, వినయ్, నాగరాజు, ప్రదీప్, రామ్‌చరణ్, సందీప్, వినయ్, శరత్, సంపత్ పాల్గొన్నారు.

చేవెళ్లటౌన్ : చేవెళ్లలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించి ఆయన విగ్రహానికి ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అరుణ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎస్ఎఫ్ఐ మండల నాయకులు దేవేందర్, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల మండల అధ్యక్షులు, కార్యదర్శి సమీర్, చందు నాయకులు పాల్గొన్నారు.

పోరాటయోధులు యువతకు ఆదర్శం

పెద్దఅంబర్‌పేట : మున్సిపాలిటీ పరిధి రావినారాయణరెడ్డి కాలనీలో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారి త్యాగాలను యువజన, విద్యార్థి సంఘాల నాయకులు మధు, వెంకటేశ్ గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రవీంద్రాచారి, యాదిరెడ్డి మాట్లాడుతూ.. పోరాటయోధులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు వీరేశ్, శ్రావణి, నిఖిల్, కార్తీక్, సంజయ్, గణేశ్, అంజి, భాను, స్వామి పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలో భగత్‌సింగ్ వర్ధంతిని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కేతరాజు నర్సింహ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, నాయకులు భిక్షపతి, లక్ష్మి, అన్నపూర్ణ, లక్ష్మి, వైశాలి, మంజులగీత, శివ ఉన్నారు.

మున్సిపాలిటీ చౌరస్తాలో ..

తుర్కయాంజాల్ : భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం ఎఐఎస్ఎఫ్–ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ చౌరస్తాలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు యాదయ్య, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్ హాజరై భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు దర్శన్, బీఎస్పీ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రమేశ్, నాయకులు శ్రీకాంత్, శివ, వివేక్, రెడ్డినాయక్, కృష్ణ, బ్రహ్మయ్య, హనుమంత్, కోట్యనాయక్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయసాధనకు కృషి చేయాలి

యాచారం : మండలంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 94వ వర్ధంతిని ఆదివారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని మాల్, చింతపట్ల, ధర్మన్నగూడ గ్రామాల్లో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఆశయసాధన కోసం యువత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. భగత్‌సింగ్ నేటి యువతకు ఆదర్శంగా నిలిచాడని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, బ్రహ్మయ్య, భాషయ్య, శ్రీమన్నారాయణ, చందూనాయక్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలను కల్పించాలి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మొయినాబాద్, మార్చి 23 : భవన నిర్మాణ కార్మికుల లేబర్ అడ్డాల వద్ద ప్రభుత్వం మౌలిక సదుపాయాలను కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి పర్వతాలు అన్నారు. ఆదివారం మొయినాబాద్ మున్సిపాలిటీ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లేబర్ అడ్డాల వద్ద గంటల తరబడి పనులకు కోసం ఎదురు చూస్తున్న కార్మికుల కోసం మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. మహిళా కార్మికులకు టాయిలెట్స్ లేక చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. నిర్మాణ సంస్థలు కార్మికులకు తక్కువ కూలిలు ఇచ్చి ఎక్కువ పని గంటలు చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ రంగాల్లో వలస కార్మికులు చనిపోతే వారి కుటుంబానికి నష్ట పరిహారం ఇవ్వడం లేదన్నారు. ఏప్రిల్ 21, 22న శంషాబాద్‌లో జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలన్నారు. 21న శంషాబాద్‌లో జరిగే ర్యాలీ, బహిరంగ సభకు జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులంతా పెద్ద ఎత్తున తరలిరవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్‌రెడ్డి, కార్యదర్శి సత్యనారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి నర్సింహారెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు చందూయాదవ్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

అంబేద్కర్ సంఘం కమిటీ ఎన్నిక

మొయినాబాద్, మార్చి 23 : మున్సిపాలిటీ మండల కేంద్రంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కమిటీని ఏర్పాటు చేశారు. ఆదివారం ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల మాజీ అధ్యక్షుడు షాబాద్ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో కమిటీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా డి.మహేశ్, ఉపాధ్యక్షుడిగా కె ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా ప్రదీప్, సంయుక్తకార్యదర్శిగా అంకిత్, కోశాధికారిగా శాంతికుమార్, సలహాదారులుగా శ్రీకాంత్, శ్రీనివాస్, ప్రమోద్, వరప్రసాద్, శ్రీకాంత్ పరమేశ్‌లను ఎన్నుకున్నారు.

చెక్కు అందజేస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, మార్చి 23: ప్రభుత్వాలు పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పెంటతండాకు చెందిన జాటవత్ రవికి సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ. 18వేల చెక్కును ఆదివారం బాధితుడికి ఆయన అందజేశారు. ఆయన వెంట నాయకులు సుభాష్, శంకర్‌నాయక్, రాములునాయక్, చంద్రశేఖర్‌రెడ్డి, సుమన్‌నాయక్, సతీశ్, శేఖర్, శివకుమార్, శ్రీను ఉన్నారు.

రైతు భరోసా నిధులను విడుదల చేయాలి

చేవెళ్లటౌన్, మార్చి 23: రైతులకు రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య అన్నారు. ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రంగారెడ్డి జిల్లా నాల్గో మహాసభలు సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

కేశంపేటలో వన మహోత్సవం

కేశంపేట, మార్చి 22: మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన వన మహోత్సవంలో స్థానికులు ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఆయా సామాజిక వర్గాల ప్రజలు తమ వ్యవసాయ పొలాలవద్దకు వెళ్లి వంటలను తయారు చేసి సహపంక్తి భోజనాలు చేశారు. తెలుగు సంస్కృతీసంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పలువురు అభిప్రాయపడ్డారు.

తోటి స్నేహితుడికి ఆర్థిక సాయం

మంచాల, మార్చి 23: మంచాల మండల పరిధిలోని జాపాల గ్రామానికి చెందిన యాట రవి ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో ఆదివారం జాపాల జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 10వ తగరతి చదువుకున్న 1998–99బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి రూ. 30వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో చంద్రకాంత్, రహూఫ్, భాస్కర్, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



బాటసింగారంలో జరిగిన సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం

మొయినాబాద్, మార్చి23: నగరంలోని లంగర్‌హౌస్‌లోని విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో చదివిన 2004–05 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం మొయినాబాద్ మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి రెవెన్యూలోని ఏ వ్యవసాయ క్షేత్రంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులతో పాటు పాఠశాల చైర్మన్ దేవానంద్‌గౌడ్, ప్రిన్సిపాల్ మాధవరెడ్డి, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు భరత్‌రెడ్డి, జగదీశ్‌ముదిరాజ్, చేతన్‌శర్మ, కృష్ణమూర్తి, వినయ్‌కుమార్, శ్రీలతరెడ్డి, అర్చనరెడ్డి, మల్లికార్జునరావు, అక్షితఅగర్వాల్, దీప్తి, దివ్యవాణీరెడ్డి శివప్రసాద్ పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు, మార్చి 23 : ఆమనగల్లు పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం ఆమనగల్లు పట్టణానికి చెందిన అరబిందో ఉన్నత పాఠశాలకు చెందిన 2010–2011 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం చిన్ననాటి మిత్రులు కలుసుకుని తమ జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి గురువులను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజయ్య, జగన్, నాగమణి, నరేశ్, భాస్కర్, సురేశ్, రాజేందర్, లక్ష్మయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 23 : అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు బోధన చేసిన గురువులను శాలువాలతో సన్మానించి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్‌రెడ్డి, రంగయ్య, నరసింహరావు, హేమలత, నిర్వాహకులు సంతోశ్‌రెడ్డి, భూపాల్, లింగస్వామి, బాల్‌రాజ్‌గౌడ్, రాజేశ్వర్, గిరిజ, హేమలత ఉన్నారు.

వన సంరక్షణే మన సంరక్షణ

కేశంపేట, మార్చి 23: వన సంరక్షణ కోసం ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ నీతాపాలె అన్నారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో ఆదివారం తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల షాద్‌నగర్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. మొక్కలు నాటి పెంచాలని, దీని వల్ల పల్లె, పట్టణాల్లో మంచి వాతావరణం పెంపొందుతుందన్నారు. వారం రోజులపాటు గ్రామంలో ఎన్ఎస్ఎస్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గ్రామ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి స్వచ్ఛ భారత్ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు అప్రాజ్‌జహాన్, బిందుశ్రీ, కార్యదర్శి రాఘవేందర్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

కంపుకొడుతున్నా.. పట్టించుకోరా?

రహదారిపై పారుతున్న మురుగునీరు

పెద్దఅంబర్‌పేట, మార్చి 23: మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారం– మర్రిపల్లి ప్రధాన రహదారిపై పలుచోట్ల మురుగు పారుతున్నది. మరికొన్ని చోట్ల మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు వస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతున్నది. మురుగునీరు పారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోరా అని ద్విచక్రవాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ కాలనీకి వెళ్లే మార్గంతోపాటు అయ్యప్పకాలనీకి ఎదురుగా నిత్యం మురుగు రహదారిపై పారుతున్నదని స్థానికులు చెబుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి.. మురుగు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

తుర్కయాంజాల్ మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే దారిలో పై కప్పు లేకుండా ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

పొంచివున్న ప్రమాదం

తుర్కయాంజాల్, మార్చి 23: తుర్కయాంజాల్ మున్సిపాలిటీలో ఎక్కడబడితే అక్కడ మ్యాన్ హోల్స్ నోళ్లు తెరచుకున్నాయి. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో మ్యాన్ హోల్స్ పైకప్పులు అనేక ప్రాంతాల్లో ధ్వంసంమయ్యాయి. మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారిలో మ్యాన్ హోల్ ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రజలు ప్రమాదాల బారీన పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక చాలా చోట్ల మ్యాన్ హోల్స్ ద్వారా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.